
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



5 సిద్దిపేట

సోమవారం 5 ఫిబ్రవరి 2024



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

మురిపించిన మల్లన్న

- మూడోవారం కొమురవెల్లి భక్తజనసంద్రం
- పట్నాలు రచించి, బోనం నివేదన
- మల్లన్న ఆలయాభివృద్ధికి కృషి
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



మల్లన్నకు పూజలు చేస్తున్న వీరశైవార్చకులు

7లో..

ఉచిత దర్శన
పాసుల దందా



బోనంతో మహిళ



బోనస్ ఆశలు

- రూ.500 బోనస్ హామీతో వరికి మొగ్గు చూపిన రైతులు
- యాసంగి సీజన్‌లో 3.77 లక్షల ఎకరాల్లో సాగు
- గతేడాది కంటే ఈసారి 47వేల ఎకరాల్లో సాగు అధికం

గజ్వేల్, ఫిబ్రవరి 4: రైతుల్లో బోనస్ ఆశలు చిగురించాయి. వరికి రూ.500 బోనస్ ఇస్తామని ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో సిద్దిపేట జిల్లా రైతులు ఎక్కువగా వరిసాగుకు మొగ్గుచూపారు. గత ఏడాదితో పోలిస్తే దాదాపు 50వేల ఎకరాల్లో వరి సాగు పెరిగింది. జిల్లాలో గడిచిన నాలుగేళ్ల నుంచి సాగునీటి రిజర్వాయర్లు అందుబాటులోకి రావడంతో యాసంగిలో వరి సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. 2018కి ముందు జిల్లాలో యాసంగి సీజన్‌లో కేవలం లక్షా యాభై వేల ఎకరాల్లో వరిని సాగు చేస్తే ఏటా దాదాపుగా 50వేల ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం పెరుగుతూ వచ్చింది. 2022 యాసంగిలో 2.63 లక్షల ఎకరాల్లో, గతేడాది యాసంగిలో 3.30లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇక ఈ ఏడాది ఏకంగా 3.77లక్షల ఎకరాల్లో వరిసాగవుతుందని అధికారులు నిర్ధారించారు. జిల్లావ్యాప్తంగా 47వేల ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ నేపథ్యంలో వరికి వానాకాలంలో మద్దతు ధర రూ.2183గా ఉండగా తెలంగాణ ప్రభుత్వం బోనస్‌ను ప్రకటిస్తే రూ.2,683 దక్కనున్నది.

ఆయా రిజర్వాయర్ల నుంచి నీటి విడుదల

జిల్లాలోని రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ల నుంచి రైతులకు సాగునీటిని మూడేళ్లుగా ఏటా విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ నుంచి నీటిని ప్రభుత్వం విడుదల చేసింది. ఇటీవలే మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మకు వెళ్లే ప్రధాన కాలువ నుంచి కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేశారు. వచ్చే వారం రోజుల్లో సంగారెడ్డి కెనాల్ ద్వారా హల్దీవాగులోకి నీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. సాగునీటిని వాగుల్లోకి విడుదల చేయడం ద్వారా బోరుబావుల్లో నీటి లభ్యత పెరిగి పంటకు సాగునీరు అందనుంది. అంతేకాకుండా వాగులు దగ్గరగా ఉన్న రైతులు మోటార్లను ఏర్పాటు చేసుకుని వరి పంటకు నీరు సమకూర్చనున్నారు. ఇక విద్యుత్‌ను 24గంటల పాటు అందిస్తే ఈ ఏడాది భారీ దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

గోదావరి పరవళ్లు

తొగుట, ఫిబ్రవరి 4: గోదావరి జలాలతో కూడవెల్లి వాగు పరవళ్లు తొక్కుతున్నది. ఈనెల2న మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటిని విడుదల చేశారు. అదే రోజు కొడకండ్ల గ్రామం వద్ద కూడవెల్లి వాగులోకి వదిలారు. మొన్నటి వరకు నీరు లేక బోసిపోయిన కూడవెల్లి వాగు గోదావరి జలాలతో కళకళలాడుతున్నది. ఆదివారం తొగుట మండలం చందాపూర్ గ్రామం వద్ద ఉన్న చెక్‌డ్యాం పొంగిపొర్లింది. పరివాహక ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తొగుట మండలం చందాపూర్ వద్ద గోదావరి జలాలతో పొంగిపొర్లుతున్న చెక్‌డ్యాం

బల్దియా పీఠం కాంగ్రెస్‌కు దక్కేనా?

- బీఆర్‌ఎస్‌ను గద్దెదించినా అధికారం దక్కడం డౌటే!
- ఆసక్తికరంగా సంగారెడ్డి మున్సిపల్ రాజకీయం

సంగారెడ్డిటౌన్, ఫిబ్రవరి 4: సంగారెడ్డి గ్రేడ్‌వన్ మున్సిపాలిటీలో రాజకీయం ఆసక్తికరంగా మారింది. బీఆర్‌ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మీరవి, వైస్ చైర్‌పర్సన్ లతావిజయేందర్‌రెడ్డిలపై అవిశ్వాసం నోటీసులు ఇచ్చేందుకు మెజార్టీ కౌన్సిలర్లు సిద్ధమైన విషయం తెలిసిందే. ఇప్పటికే బీఆర్‌ఎస్‌తోపాటు కాంగ్రెస్, ఎంఐఎం, బీజేపీలకు చెందిన మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాన నోటీసులపై సంతకాలు చేశారు. అయితే చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లను గద్దెదించేందుకు సిద్ధమైన కౌన్సిలర్లు కొత్త వారిని ఎన్నుకునే వరకు ఐక్యంగా ఉంటారా అనేది ఆసక్తికరంగా మారింది. కౌన్సిల్‌లో మెజార్టీ ఉన్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు రెండు గ్రూపులుగాగా చీలిపోయి కాంగ్రెస్, ఎంఐఎం, బీజేపీ కౌన్సిలర్లతో జతకట్టారు. ఒకవేళ అవిశ్వాసం నెగ్గి కొత్తవారిని ఎన్నుకోవాలంటే చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులు అధికార పార్టీ దక్కించుకునే విషయంలో బీఆర్‌ఎస్, ఎంఐఎం, బీజేపీ కౌన్సిలర్లు మాటకు కట్టుబడి ఉంటారా అన్న ప్రశ్న ఎదురవుతున్నది.

ఎవరి బలం ఎంతంటే..

సంగారెడ్డి మున్సిపాలిటీలో మొత్తం 38 వార్డులున్నాయి. 2019లో ఎన్నికల్లో బల్దియా ఎన్నికల్లో గెలిచిన చింతలపల్లి కౌన్సిలర్ రెండేళ్ల క్రితం మృతిచెందడంతో ప్రస్తుతం 37 మంది కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్‌ఎస్ నుంచి 19 మంది, కాంగ్రెస్ నుంచి 9 మంది, ముగ్గురు బీజేపీ, ఇద్దరు ఎంఐఎం, నలుగురు ఇండిపెండెంట్లు ఉన్నారు. బీఆర్‌ఎస్‌కు చెందిన బొంగుల విజయలక్ష్మిని చైర్‌పర్సన్‌గా, లతా విజేందర్‌రెడ్డిని వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. గత సంవత్సరం రెండుగా చీలిపోయిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అప్పటి కలెక్టర్ శరత్‌కు అవిశ్వాసం నోటీసులను అందజేశారు. అప్పుడు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉండడంతో జిల్లా మంత్రి హరీశ్‌రావు చొరవతో కౌన్సిలర్లు వెనక్కి తగ్గారు. ప్రభుత్వం మారడంతో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సభ్యులు సిద్ధమయ్యారు.

చైర్‌పర్సన్ సీటు కాంగ్రెస్‌కు దక్కేనా?

బీఆర్‌ఎస్‌కు చెందిన సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ లతావిజయేందర్‌రెడ్డిలపై అవిశ్వాసం నెగ్గితే ఆ సీటు కాంగ్రెస్‌కు దక్కే అవకాశాలు ఏమేరకు ఉన్నాయనే అంశంపై జగ్గారెడ్డితో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు సంకోచిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ను గద్దె దించేవరకు కాంగ్రెస్‌తో కలిసి ఉన్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు చెందినవారిని ఎన్నుకునేవరకు తోడుగా ఉంటారో లేదోనన్న అనుమానాలను పలువురు కౌన్సిలర్లు వ్యక్తం చేస్తున్నారు.



దుబ్బాక రెవెన్యూ డివిజన్ సాధనకు చేపట్టిన రిలే దీక్షలు (ఫైల్)

మళ్లీ దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఆశలు

- కొత్త జిల్లాలపై సమీక్ష తరువాత ప్రభుత్వ నిర్ణయం
- మూడు దశాబ్దాలుగా డిమాండ్

7లో..

పట్టణ ప్రగతికి నిధుల గ్రహణం

- 9 నెలలుగా రూ. 3.4 కోట్లు బకాయి
- మెదక్ జిల్లాలోని 4 మున్సిపాలిటీల్లో నిలిచిన అభివృద్ధి


మెదక్, ఫిబ్రవరి 4: మున్సిపాలిటీల్లో సదుపాయాల కల్పన, అభివృద్ధి, సుందరీకరణ పనుల నిర్వహణ కోసం గత ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించింది. పట్టణాలకు ప్రతి నెలా క్రమం తప్పకుండా నిధులు అందజేయడం ఈ పథకం ఉద్దేశం. జనాభా ప్రాతిపదికన నిధులు అందజేసి నిర్దేశించి పనులను చేపట్టేవారు. మొదటి సంవత్సరం రెగ్యులర్‌గా నిధులు మంజూరు కావడంతో పనులు వేగంగా జరిగాయి. క్రమంగా నిధుల విడుదలలో జాప్యం కావడం మొదలైంది. మూడు నెలలకోసారి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పరిపాటిగా మారింది. జిల్లా కేంద్రమైన మెదక్ మున్సిపాలిటీకి జనాభా ప్రాతిపాదికన ప్రతీ నెల రూ. 17 లక్షలు, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేటకు నెలకు రూ. 7 లక్షల చొప్పున నిధులు కేటాయించేవారు. కానీ గతేడాది కేవలం నాలుగు నెలలకు సంబంధించిన నిధులు మాత్రమే మంజూరయ్యాయి. మే నెల నుంచి నిధులు ఆగిపోయాయి. తొమ్మిది నెలలకు సంబంధించి మెదక్ మున్సిపాలిటీకి రూ.1.53 కోట్లు, మిగిలిన మూడు బల్దియాలకు రూ.63 లక్షల చొప్పున నిధులు రావాల్సి ఉన్నది.

నిధులొస్తాయనే ధీమాతో పనులు

నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో పట్టణప్రగతి కింద చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రతిపాదించిన పనులు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఇప్పటికే పూర్తిచేసిన వాటికి బిల్లులు రావడంలేదు. ఆలస్యమైనా పట్టణ ప్రగతి నిధులు వస్తాయనే నమ్మకంతో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం, పాలకవర్గం సమావేశంలో తీర్మానించి వివిధ పనులను ప్రారంభించారు. మెదక్ మున్సిపాలిటీలో గత సంవత్సరం రూ.2 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు టెండర్లు నిర్వహించారు. మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని 32 వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, వసతుల కల్పన పనులు చేపట్టారు. బిల్లులు వస్తాయనే నమ్మకంతో పనులు పూర్తిచేశామని, నెలలు గడుస్తున్నా బిల్లులు మాత్రం రావడం లేదని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల చేసిన ప్రకటన కాంట్రాక్టర్లకు ఊరటనిస్తున్నది. చిన్న కాంట్రాక్టర్లకు పెండింగు బిల్లులు చెల్లిస్తామని ఆయన ప్రకటించడంతో ఆశలు చిగురించాయి.

లోక్‌సభ ఎన్నికల్లో
మెదక్‌లో బీఆర్‌ఎస్ విజయం ఖాయం

- ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుంటాం
- అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో అధికారం దూరం
- కార్యకర్తలు నిరుత్సాహపడకుండా పోరాడాలి
- మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు



పటాన్‌చెరులో బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 4: లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ అగ్ర నాయకుడు టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. పటాన్‌చెరు జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మెదక్ పార్లమెంటరీ పార్టీ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 1.8 శాతం స్వల్ప తేడాతో అధికారం చేజారిందని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌పై చేసిన విష ప్రచారం కారణంగానే అధికారానికి దగ్గరగా వచ్చి ఆగిపోయామని పేర్కొన్నారు. ప్రగతిభవన్‌లో 150 గదులు ఉన్నాయని ప్రచారం చేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని అసెంబ్లీలో నిలదీస్తే తలదించుకున్నారని తెలిపారు. అంబేడ్కర్ పేరిట అద్భుతమైన సెక్రటేరియట్ నిర్మిస్తే విమర్శించిన వారే నేడు సిగ్గులేకుండా వాడుకుంటున్నారని విమర్శించారు. రైతుబంధు ఇస్తామని నేనంటే కాంగ్రెస్ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకుందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చకుండా అధికారాన్ని అడ్డుపెట్టుకుని దౌర్జన్యాలకు దిగుతున్నారని విమర్శించారు.

వారికి ఓటేయడం వృథా

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేయడం వృథా అని విమర్శించారు. బీజేపీ చేసిన పనులేమీ లేకపోవడంతోనే గుడి పేరిట ఓట్లడిగేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. యాదాద్రి ఆలయం కట్టిన కేసీఆర్ ఏనాడూ రాజకీయం చేయలేదని పేర్కొన్నారు. పటాన్‌చెరులో 150 గుళ్లను కట్టిన మహిపాల్‌రెడ్డి ఏనాడు మతం పేరిట ఓట్లు అడగలేదని అన్నారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పోరాడే బీఆర్‌ఎస్ తరఫున ఢిల్లీలో ప్రాతినిధ్యం ఉండాల్సిందేనన్నారు. నాయకులంతా సమన్వయంతో పనిచేసి మెదక్ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈసారి మెదక్ ఎంపీ అభ్యర్థిని పటాన్‌చెరు సెగ్మెంట్ నుంచి ఎంపిక చేయాలని, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, గాలి అనిల్‌కుమార్ పేర్లను పరిశీలించాలని హరీశ్‌రావును కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే సునితలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, సత్యనారాయణ, నాయకులు ప్రతాప్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, నాయకులు పాల్గొన్నారు.

ఆటోవాలాల సమస్యలు తెలుసుకున్న హరీశ్

పటాన్‌చెరు బస్‌స్టాండ్ వద్ద ఆటో కార్మికులతో హరీశ్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కనీసం ఆటో ఈఎంఐలు కట్టలేని పరిస్థితి ఏర్పడిందని ఆటో డ్రైవర్లు ఆయనతో చెప్పారు. తమ కుటుంబాలు వీధిన పడ్డాయని, ఆదుకోవాలని హరీశ్‌రావును కోరారు. ఆటో కార్మికులు అధైర్య పడకూడదని, వారి సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు



జూనియర్ బాలికల
సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ నిజామాబాద్

- సిద్దిపేట జట్టుకు మూడో స్థానం
- తూప్రాన్‌లో ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు

7లో..

కాంస్య పతకాన్ని సాధించిన సిద్దిపేట జిల్లా జట్టు

పెండింగ్ వేతనాలు విడుదల చేయండి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 4 : నాలుగు నెలలుగా సక్రమంగా వేతనాలు అందక వైద్యారోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ. నుస్రత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తమకు దిశా ఏజెన్సీ ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారని, కానీ వారు సక్రమంగా ఇవ్వడంలేదని, ఇచ్చే వేతనాల్లో ఈఎస్ఐ, పీఎఫ్ కోసం జీతంలో కోతలు విధించేవారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు బకాయి వేతనాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. తమకు ఏజెన్సీ ద్వారా కాకుండా ట్రెజరీ ద్వారా వేతనాలు ప్రతి నెల సక్రమంగా అందజేసి న్యాయం చేయాలని ఆయన కోరారు.

84 కిలోల గంజాయి స్వాధీనం

● నిందితుడి అరెస్ట్



పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 4: హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు కారులో తరలిస్తున్న గంజాయిని మెదక్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పటాన్‌చెరు ఎక్సైజ్ సిబ్బంది ఆదివారం తెల్లవారుజామున సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో పట్టుకున్నారు. మెదక్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రఘురాం తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు పట్టణ శివారులోని టోల్‌ప్లాజా వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి తరలిస్తున్న కారు పట్టుపడింది. నల్గొండ జిల్లా చందంపేట మండలం బొల్లారం పట్టి గ్రామానికి చెందిన రమావత్‌రాకేష్‌చంద్ర తన కారులో రూ.12లక్షల విలువైన 84 కిలోల గంజాయి ప్యాకెట్లను తరలిస్తున్న క్రమంలో ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

మెదక్ ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు

చేగుంట, ఫిబ్రవరి 4: నార్సింగి మండలంలోని పలు గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని మెదక్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోవర్ధన్, కాంగ్రెస్ నాయకులు ఆదివారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావును కోరారు. మెదక్ నియోజకవర్గంలోని నార్సింగి మండలానికి సంబంధించిన షేర్‌పల్లి, సంకాపూర్, కాస్లాపూర్, జప్తి శివనూర్ గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేను వారు కోరారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సానుకూలంగా స్పందించి త్వరలోనే అభివృద్ధి పనులు చేపడతానని హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు.

ఖేడ్ న్యాయవాదికి రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 4: నిందితుడికి యావజ్జీవ శిక్ష పడే విధంగా విధులు నిర్వహించినందుకు నారాయణఖేడ్ పరిధిలోని వాసర్‌కు చెందిన పీపీ అనంత్‌రావు కులకర్ణికి రాష్ట్ర స్థాయి ఉత్తమ పీపీ అవార్డు దక్కింది. అనంత్‌రావు కులకర్ణి జిల్లా కోర్టులో దాదాపు 15 సంవత్సరాలుగా పీపీగా సేవలు అందిస్తున్నారు. అమీన్‌పూర్‌లో జరిగిన ఓ సంఘటనకు సంబంధించి నిందితుడికి యావజ్జీవ జైలు శిక్షపడే విధంగా కృషి చేసినందుకు హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి ఓ కార్యక్రమంలో అడిషినల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శిఖాగోయల్ ఉత్తమ అవార్డును అందించారు.

మాల మహానాడు కమిటీ ఏర్పాటు

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి4: చిన్నశంకరంపేట మండలం దరిపల్లి గ్రామ మాల మహానాడు కమిటీని ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లా అధ్యక్షుడు నంది సురేష్ ఆధ్వర్యంలో దరిపల్లి గ్రామ అధ్యక్షుడిగా చింతకుంట ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా మాదరం ఉదయ్‌కిరణ్‌న్ను ఎన్నుకున్నారు.

పోలీసు సంఘానికి ఎన్నికలు నిర్వహించాలి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 4: పోలీసు సంఘానికి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ పోలీసు ఉద్యమకారుడు, మాజీ కానిస్టేబుల్ బొర్గి సంజీవ్‌లు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలీసు సంఘానికి మూడు సంవత్సరాలకోసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, 2013 తర్వాత ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించలేదని తెలిపారు. ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టును ఆశ్రయించడంతో 2016లో హైకోర్టు సైతం ఆదేశించినా, ఎన్నికలు నిర్వహించలేదన్నారు. హైకోర్టు ఆదేశాలను ఉల్లఘించడం సరికాదన్నారు.

కార్మికుల సంక్షేమానికి పోరాటం

● బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి



రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఎంఎస్ నాయకులు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 4: కార్మికుల సంక్షేమం కోసం బీఎంఎస్ నిరంతర పోరాటం చేస్తుందని భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) జిల్లా అధ్యక్షుడు తోట నరసింహారెడ్డి తెలిపారు. ఈ నెల 17, 18తేదీల్లో గోదావరిఖనిలో నిర్వహిస్తున్న బీఎంఎస్ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సంగారెడ్డిలోని జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాసభలకు గవర్నర్ హాజరవుతారని తెలిపారు. సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి పరిష్కారం కోసం ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కాగా 16న కమ్యూనిస్టు యూనియన్లు తలపెట్టిన బంద్‌ను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంఘటన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, ఎంఆర్‌ఎఫ్ యూనియన్ నాయకులు శ్రావణ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, కాశీనాథ్, ఆంజనేయులు, లక్ష్మణ్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

చేగుంట, ఫిబ్రవరి 4 : గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు నార్సింగి మండలం నర్సంపల్లి పెద్ద తండాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నార్సింగి జడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, పార్టీ మండల అధ్యక్షుడు మైలారం బాబు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సత్యనారాయణ, సుజాత మల్లేశం గౌడ్, మాజీ సర్పంచ్ క్షత్రియ నాయక్ తదితరులు పాల్గొన్నారు.







ఆలయ వీధుల్లో భక్తుల రద్దీ, పట్నం వేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు, బోనంతో సిగమూగుతున్న శివసత్తులు

మమ్మేలు మల్లన్నా

● మూడోవారం కొమురవెల్లి భక్తజనసంద్రం ● పట్నాలు రచించి, బోనం నివేదన



వీరకోలతో భక్తుడి సిగాలు



కోనేరు ప్రాంగణంలో నిలిచిన మురుగు నీరు

చేర్యాల, ఫిబ్రవరి 5 : కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో వారాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నానమాచరించారు. భక్తిప్రపత్తులతో బోనం నివేదించి పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లంపానకం శాకపెట్టి బోనం నివేదించారు. తమను చల్లగా కాపాడుమని వేడుకున్నారు. తమ కోరికలు ఈడేర్చమని వేడుకుంటూ గంగరేగుచెట్టుకు ముడుపులుకట్టారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో వీవీఐపీ, ప్రత్యేక ఉచిత దర్శన క్యూలైన్లలో బారులు తీరారు. స్వామివారి దర్శనానికి సుమారు 4 గంటల పాటు సమయం పట్టింది. అడిషనల్ డీసీపీ ఎస్.మల్లారెడ్డి బందోబస్తు చర్యలను పర్యవేక్షించారు. కొమురవెల్లి మల్లన్నను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుటుంబసమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. అలాగే మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు స్వామివారిని దర్శించుకుని అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

కోనేరు ప్రాంగణంలో నిలిచిన మురుగు నీరు

మురుగు నీరు ఆలయ కోనేరు ప్రాంగణంలో నిలవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. నీటి నిల్వతో దుర్గంధం వెదజల్లడంతో స్నానమాచరణతో పాటు వసతి గదులకు వెళ్లడానికి భక్తులు తంటాలు పడ్డారు.

ఉచిత దర్శన పాసుల దందా



వలంటీర్ల వద్ద పట్టుబడిన ఉచిత పాసులు

చేర్యాల, ఫిబ్రవరి 4 : కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ప్రత్యేక దర్శన ఉచిత పాసులను ఇష్టానుసారం విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్న పలువురు వలంటీర్లు ఆదివారం పట్టుబడ్డారు. వివరాలిలా ఉన్నాయి. ప్రతీ శని, ఆది, బుధవారాల్లో భక్తులు రద్దీ దృష్ట్యా డోనర్లు, వీఐపీలకు దర్శన సౌకర్యం కల్పించేందుకు ఆలయ ఏఈవో గంగా శ్రీనివాస్, ఈవో బాలాజీశర్మ పాసులు జారీ చేస్తున్నారు. జాతర సందర్భంగా పలువురిని వలంటీర్లుగా నియమించగా పబ్బోజు శ్రీనివాస్, చల్లా శేఖర్ రెడ్డి, పెద్ది భాస్కర్‌రెడ్డి, స్వాములపల్లి కరుణాకర్, రమణకుమారి ఏఈవో గంగా శ్రీనివాస్ నుంచి పాసులు పొంది ఒక్కోపాసు పేరిట భక్తుల నుంచి రూ.1000-1500 వరకు వసూలు చేసి వీఐపీ క్యూలైన్‌గుండా దర్శనానికి పంపించసాగారు. ఈక్రమంలో రూ.500 వీవీఐపీ క్యూలైన్ ఆవరణలో పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తదితరులు పాస్‌ను పరిశీలించారు. ఓ భక్తుడిని టికెట్ తీసుకోవాలని కోరగా ఇంతకు ముందే రూ.వెయ్యి చెల్లించామని తెలపడంతో ఆరాతీశారు. వలంటీర్లను పట్టుకోగా వారి వద్ద ఏఈవో గంగా శ్రీనివాస్ సంతకాలతో కూడిన పాసులు లభ్యమయ్యాయి. వలంటీర్లను కొమురవెల్లి పోలీసులకు అప్పగించారు. ఈవో బాలాజీశర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాగరాజు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బాసర సరస్వతీ ఆలయం నుంచి బదిలీపై వచ్చిన ఏఈవో గంగా శ్రీనివాస్ వ్యవహారశైలిపైనా విచారణ చేపట్టాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

మల్లన్న ఆలయాభివృద్ధికి కృషి

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



మల్లన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

చేర్యాల/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 4 : కోట్లాదిమంది భక్తుల ఇలవేల్పయిన మల్లన్న ఆలయం పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆశించిన తీరులో అభివృద్ధికి నోచుకోలేదని, కాంగ్రెస్ ప్రజాపాలనలో ఆలయాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మల్లన్నను దర్శించుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలన అంతా ప్రచారమయమని, ప్రజలకు ఒణగూరిందేమీలేదన్నారు. మల్లన్న ఆలయంలో భక్తుల వసతుల కల్పన మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. మల్లన్న ఆశీస్సులతో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఆరుగ్యారంటీలను తప్పక అమలు పరుస్తుందని పేర్కొన్నారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లి జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మ అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ సిబ్బంది, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ సిబ్బంది ఆయనకు తీర్థప్రసాదాలు అందించి, శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో కొండపోచమ్మ ఆలయం అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. ఆలయ అభివృద్ధి విషయం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.



మల్లన్నకు పూజలు చేస్తున్న తలసాని

బీఆర్ఎస్ హయాంలోనే మల్లన్న ఆలయాభివృద్ధి : తలసాని

బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో మల్లన్న ఆలయంతో పాటు తెలంగాణ ప్రాంత ఆలయాలు అభివృద్ధికి నోచుకున్నాయని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మల్లన్నను దర్శించుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మల్లన్న దర్శనార్థం వచ్చే భక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ హయాంలోనే ఆలయంలో మౌలిక వసతుల కల్పనకు తామెంతో కృషి చేశామన్నారు. అందుకే ఆలయానికి వచ్చే భక్తులతో పాటు ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. తాను దర్శనానికి వచ్చిన సందర్భంగా రాజకీయాల గురించి మాట్లాడబోనన్నారు. అనంతరం కొండపోచమ్మ ఆలయానికి వెళ్లిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు ఆయనకు ఘనస్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

భక్తులతో కిటకిటలాడిన నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం

వర్గల్, ఫిబ్రవరి 4 : జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఆలయ పుష్కరిణీలో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.



నాచగిరి క్షేత్రంలో లక్ష్మీనృసింహస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

అనుమానాస్పదస్థితిలో మాజీ ఎంపీటీసీ మృతి



బండి వెంకటయ్య

నంగునూరు, ఫిబ్రవరి 4 : నంగునూరు మండలం ఘణపూర్ మాజీ ఎంపీటీసీ బండి వెంకటయ్య అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ముందుగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని భావించిన కుటుంబ సభ్యులు అతని శరీరంపై గాయాలు ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. బండి వెంకటయ్య శనివారం రాత్రి నంగునూరులోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని భార్య బంధువుల ఇంటికి ఫోన్ చేయగా, వెంకటయ్య వెళ్లిపోయాడని చెప్పారు. దీంతో ఆయన కోసం వెతుకుతుండగా ఘణపూర్ గ్రామ శివారులో రోడ్డు పక్కన పొదల్లో మోటార్ సైకిల్ పడి ఉండడాన్ని గమనించారు. పక్కనే వెంకటయ్య పడి ఉన్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. రోడ్డు ప్రమాదంగా భావించిన కుటుంబసభ్యులు ఆదివారం అంత్యక్రియలు చేస్తుండగా మృతుని శరీరంపై గాయాలు కనబడ్డాయి. దాంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు రాజగోపాల్ పేట ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. మాజీ ఎంపీటీసీ బండి వెంకటయ్య మృతి పట్ల ఎమ్మెల్యే హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

తండ్రిని చంపిన కొడుకు

● రామిరెడ్డిబావి గ్రామంలో ఘటన

గుమ్మడిదల, ఫిబ్రవరి 4 : మద్యం తాగి వచ్చి ఇంటి వద్ద గొడవచేస్తున్న తండ్రిని కొడుకు చంపిన సంఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం రామిరెడ్డిబావి గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. రామిరెడ్డి గ్రామానికి చెందిన కొంచం కృష్ణారెడ్డి(50) రోజు మద్యం తాగి ఇంటికి వచ్చి కుటుంబసభ్యులను తిట్టేవాడు. రోజు మాదిరిగా శనివారం రాత్రి కూడా కృష్ణారెడ్డి మద్యం తాగి వచ్చి తన భార్యని బూతులు తిడుతూ గొడవపెట్టుకున్నాడు. అప్పటికే పడుకొని ఉన్న తన కొడుకు రఘుపతిరెడ్డి లేచి ఎన్నిరోజులు ఇలా గొడవపెట్టుకుంటావు అని కృష్ణారెడ్డిని నిలదీశాడు. ఇద్దరి మధ్య మాట మాట పెరిగి రఘుపతిరెడ్డి ఇంట్లో నుంచి కట్టె తీసుకుని వచ్చి తండ్రి కృష్ణారెడ్డిని తలపై కొట్టాడు. దెబ్బ బలంగా తాకడంతో కృష్ణారెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. కృష్ణారెడ్డి బామ్మర్ది సుడే బాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

దుబ్బాక రెవెన్యూ డివిజన్‌పై ఆశలు

● కొత్త జిల్లాలపై సమీక్ష తరువాత ప్రభుత్వ నిర్ణయం
● మూడు దశాబ్దాలుగా డిమాండ్

దుబ్బాక, ఫిబ్రవరి 4 : దుబ్బాక రెవెన్యూ డివిజన్‌పై ప్రభుత్వం కొత్త విధానాన్ని అవలంబించనున్నట్టు తెలిసింది. ఇటీవల దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటును కాంక్షిస్తూ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితోపాటు పలు కొత్త డివిజన్‌లను కోరుతున్న ఆయా ప్రాంతాల నాయకులకు ప్రభుత్వం నుంచి ఈ సమాధానం వచ్చినట్టు తెలిసింది. అసెంబ్లీ నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణతోపాటు నూతనంగా ఏర్పడ్డ జిల్లాలపై వేయనున్న అధ్యాయన కమిటీ నివేదిక తరువాతే దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని అధికారవర్గాల ద్వారా తెలిసింది. దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి, తొగుట, దౌల్తాబాద్, రాయపోల్ మండలాలను కలిపి కొత్త రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలని కొన్నాళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో కూడా బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి దుబ్బాక సభల్లో ఈ మేరకు హామీనిచ్చారు.

అన్ని ప్రాంతాలకు 15 కిలోమీటర్ల దూరంలోనే

దుబ్బాక పాత పంచాయతీ గ్రామాలను కలిపి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని 30 ఏళ్ల నుంచి డిమాండ్ కొనసాగుతుంది. 1982లో దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ను పాత సంస్థానంగా పరిగణనలోకి తీసుకోవాలని అప్పటి సీఎం మర్రి చెన్నారెడ్డికి, దివంగత మాజీ ఎమ్మెల్యే ఐరేణి లింగయ్య డిమాండ్ చేశారు. దుబ్బాకకు పూర్వవైభవం రావాలంటే దుబ్బాక కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు అన్ని పార్టీల నుంచి వెలువడుతున్నాయి. ముస్తాబాద్, దుబ్బాక, బీబీపేట, మిరుదొడ్డి, తొగుట, అక్బర్‌పేట-భూంపల్లి, పెద్దనిజాంపేట మండలాలతో దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సాంకేతికంగా సాధ్యమవుతుందని పలు పార్టీల నాయకులు విన్నవించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్ మండలాన్ని సిద్దిపేట జిల్లాలో విలీనం చేయాలని ఏళ్ల నుంచి ఉన్న డిమాండ్‌ను నెరవేర్చడంతో పాటు ఆయా మండలాలను మల్లన్నసాగర్ పరిధిలోని ఒకే జోన్‌లోకి తీసుకుని వచ్చే వీలుంటుంది. దుబ్బాక కేంద్రంగా కేవలం 15 కిలోమీటర్ల దూరంలోనే రెవెన్యూ డివిజన్ కేంద్రం అందుబాటులోకి వస్తుంది.

ముస్తాబాద్ మండల విలీన డిమాండ్

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్ మండలాన్ని సిద్దిపేట జిల్లాలో విలీనం చేయాలనే డిమాండ్ మళ్లీ తెరపైకి వస్తున్నది. ముస్తాబాద్ మండలంలో 22 గ్రామాలకు మూడు గ్రామాలు మాత్రమే ఈ డిమాండ్‌ను వ్యతిరేకించాయి. ముస్తాబాద్ మండలంలోని 19 గ్రామాలను సిద్దిపేట జిల్లాలో కలపాలనే డిమాండ్‌తో పలువురు బీజేపీ నాయకులు ముస్తాబాద్‌లో ఆమరణ దీక్ష కూడా చేపట్టారు. నూతనంగా జిల్లాల ఏర్పాటు సమయంలో రాజకీయ కారణాలతో ముస్తాబాద్ విలీన డిమాండ్ నిలిచిపోయింది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం రావడంతోపాటు, జిల్లాల ఏర్పాటులో శాస్త్రీయ అధ్యాయానికి ప్రభుత్వం ఆలోచించడంతో ముస్తాబాద్ మండలంలోని పలువురు నేతలు మళ్లీ సిద్దిపేట జిల్లాలో విలీన డిమాండ్‌ను తెరపైకి తేవాలనే ఆలోచనలో ఉన్నారు.



దుబ్బాక రెవెన్యూ డివిజన్ కోసం చేపట్టిన నిరాహారదీక్ష(ఫైల్)

ప్యాకింగ్ ప్రొడక్ట్స్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

● మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది
● రూ.80 లక్షల ఆస్తి నష్టం



మాసాయిపేటలోని అట్టల పరిశ్రమలో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మాసాయిపేట, ఫిబ్రవరి 4 : మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలోని లక్ష్మీ గణపతి ప్యాకింగ్ ప్రొడక్ట్స్ అట్టల పరిశ్రమలో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో పరిశ్రమలోని రెండు భారీ విద్యుత్ మోటార్లు భారీ ఎత్తు కోడిగుడ్ల ప్యాకింగ్ మెటీరియల్, పరిశ్రమలోని స్ర్కాప్ దగ్ధమై పెద్దఎత్తున మంటల ఎగిసిపడ్డాయి. పరిశ్రమలోని కార్మికులు వెంటనే రామాయంపేటలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఎక్స్‌కవేటర్ సహాయంతో స్ర్కాప్‌ను పక్కకి నెడుతూ సుమారు రెండు గంటలపాటు శ్రమించి పరిశ్రమలోని వివిధ విభాగాలకు అంటుకున్న మంటలను అదుపులోకి తెచ్చారు. చేగుంట ఎస్ఐ హరీష్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సుమారు రూ.80 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌గా నిజామాబాద్ జట్టు



బంగారు పతకాన్ని గెలుచుకున్న నిజామాబాద్ జట్టు

తూప్రాన్, ఫిబ్రవరి4: తూప్రాన్ సెయింట్ ఆర్నాల్డ్ స్కూల్ మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ క్రీడల్లో నిజామాబాద్ జట్టు ఛాంపియన్‌గా నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్నది. ఆదిలాబాద్ జట్టు రజత పతకం, సిద్దిపేట జట్టు కాంస్య పతకాన్ని పొందాయి. ఆతిథ్య మెదక్ జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. ఆదిలాబాద్ జట్టుకు చెందిన వనిత ఉత్తమ పిచర్‌గా, నిజామాబాద్ జట్టుకు చెందిన వైశాలి ఉత్తమ క్యాచర్‌గా, సిద్దిపేటకు చెందిన పూజ ఉత్తమ బ్యాటర్‌గా, మెదక్ జిల్లాకు చెందిన కార్తీక ఉత్తమ ఆల్ రౌండర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అభిజిత్ భట్టాచార్య మాట్లాడుతూ క్రీడాకారులు నిరంతరం సాధన చేస్తూ అంతర్జాతీయ స్థాయికి ఎదిగి రాణించాలన్నారు.



రజత పతకం సాధించిన ఆదిలాబాద్ జట్టు

ప్రేరణ మనక్ కార్యక్రమంలో
రాష్ట్రస్థాయికి మద్దూరు విద్యార్థుల ప్రదర్శన

మద్దూరు, ఫిబ్రవరి 4: ప్రేరణ మనక్ కార్యక్రమంలో భాగంగా మద్దూరు మండలకేంద్రంలోని కేజీబీవీకి చెందిన కె. దీక్షిత రూపొందించిన బయోప్లాస్టిక్ బై యూజింగ్ బనానా స్టెమ్ ప్రదర్శన రాష్ట్రస్థాయికి ఎంపికైంది. జిల్లా నుంచి మొత్తంగా 1,666 ప్రాజెక్టులు అప్‌లోడ్ చేయగా, 156ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. మద్దూరు విద్యార్థి దీక్షిత ప్రదర్శన పలువురిని ఆలోచింపజేసింది. మరికొద్దిరోజుల్లో జరగనున్న రాష్ట్రస్థాయి ప్రదర్శనలో జిల్లా తరుపున పాల్గొననున్నది.

జాతీయ అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయుడు



జాతీయ అవార్డు ఆహ్వాన పత్రాన్ని ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌కు అందజేస్తున్న రాధాకృష్ణ

గజ్వేల్, ఫిబ్రవరి 4: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ టీచర్ జాతీయ అవార్డు-2024కు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు కూరాకుల శ్రీనివాస్ ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఉత్తమ టీచర్లకు ఈ అవార్డును అందిస్తారు. ఈ నెల 11న తిరుపతిలో నిర్వహించనున్న సౌత్ ఇండియా 7వ జాతీయ కాన్ఫరెన్స్‌లో శ్రీనివాస్‌కు ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. కాగా కూరాకుల శ్రీనివాస్ మర్కుక్ మండలం పాతూరు గ్రామంలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆయన విద్యాభివృద్ధికి చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు బీఎస్‌పీ జాతీయ అధ్యక్షుడు, అవార్డు సెలక్షన్ నేషనల్ కమిటీ చైర్మన్ నల్లా రాధాకృష్ణ తెలిపారు. కాగా అవార్డుకు ఎంపికవడం పట్ల ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ఆనందం వ్యక్తం చేశారు. అవార్డుకు ప్రకటించడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.

గడిపెద్దాపూర్ వద్ద అంబులెన్స్ బోల్తా

అల్లాదుర్గం, ఫిబ్రవరి 4: మండలంలోని గడిపెద్దాపూర్ గ్రామ సమీపంలోని 161వ జాతీయ రహదారిపై ఆదివారం అంబులెన్స్ వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. అల్లాదుర్గం వైపు నుంచి జోగిపేటకు వెళ్తున్న అంబులెన్సు వాహనం గడిపెద్దాపూర్ గ్రామసమీపంలో మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీ కొట్టి పక్కనే ఉన్న ఓ గోతిలో బోల్తా పడింది. వాహనంలో ఉన్న డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

సొంత భవనాలకు మోక్షమెన్నడో?

- నాలుగేళ్లు గడిచినా తాత్కాలిక భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు
- నాటి సీఎం హామీ ఇచ్చినా కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు
- ఇరుకు గదుల్లో నిర్వహణతో నారాయణరావుపేట మండల ప్రజలకు తప్పని ఇక్కట్లు



పాఠశాల ఖాళీ భవనంలో కొనసాగుతున్న తహసీల్, మండలపరిషత్ కార్యాలయాలు



పిల్లర్ల స్థాయిలోనే మండల వనరుల కేంద్రం భవన నిర్మాణం పనులు

నారాయణరావుపేట, ఫిబ్రవరి 4: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సొంత భవనాలకు మోక్షమెన్నడోనని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పరిపాలన సౌలభ్యం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త జిల్లాలతో పాటు మండలాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగానే నాలుగేళ్ల క్రితం నారాయణరావుపేట మండల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అందుబాటులో ఉన్న భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలను సర్దుబాటు చేసి ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఉపాధిహామీ పథకం కార్యాలయాలను ప్రాథమిక పాఠశాలలోని ఖాళీగా ఉన్న భవనాల్లో ఏర్పాటు చేశారు. అదేవిధంగా మండల వ్యవసాయ కార్యాలయం రైతువేదిక భవనంలో, ఐకేపీ మండల మహిళా సమాఖ్యను గ్రామైక్య సంఘంలో, విద్యుత్ సెక్షన్ కార్యాలయాన్ని గుర్రాలగొందిలో సర్దుబాటు చేసి సేవలను కొనసాగిస్తున్నారు. అయితే సరిపడా భవనాలు లేకపోవడంతో చాలీచాలని ఇరుకు గదుల్లోనే సిబ్బంది విధులు నిర్వహించాల్సిరావడం ఇబ్బందిగా పరిణమించింది.

ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమా!

నారాయణరావుపేట మండల కేంద్రంలో సొంత భవనాలు నిర్మించాలని పంపించిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో సిద్దిపేట పర్యటనకు వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్‌కు మంత్రి సమక్షంలో వినతిపత్రం అందజేయగా సానుకూలంగా స్పందించారు. సర్వశిక్షా అభియాన్ నిధులతో (ఎమ్మార్సీ) మండల మానవ వనరుల కేంద్రం నిర్మాణానికి రూ.40.70 లక్షలు మంజూరయ్యాయి. నిధులు మంజూరై ఆరు నెలలు గడిచినా నిర్మాణ పనులు మాత్రం పిల్లర్ల స్థాయిలోనే ఉన్నాయి. ఎమ్మార్సీ భవనం పనులు నత్తనడకన సాగడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయానికి నిధులు మంజూరు చేసి పక్కా భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం



మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించాలని మండల ప్రజాప్రతినిధులందరం కలిసి అప్పటి సీఎంతో పాటు మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చాం. త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ మంజూరు కాలేదు. ప్రస్తుతం కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వమైనా మండల కార్యాలయాల పక్కా భవనాలకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నాం.

- ఒగ్గు బాలకృష్ణ, ఎంపీపీ, నారాయణరావుపేట

సిద్దిపేట జ్యోతిష్యుడికి జాతీయ అవార్డు



రాజేశ్వర్‌రెడ్డికి అవార్డులను ప్రదానం చేస్తున్న దృశ్యం

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 4: సిద్దిపేట ప్రముఖ జ్యోతిష్యుడు డాక్టర్ కలకుంట్ల రాజేశ్వర్‌రెడ్డికి జ్యోతిష్య, సాహిత్య రంగంలో సేవలకు గానూ రెండు అవార్డులు దక్కాయి. యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఏటా సాహిత్య - జ్యోతిష్య రంగంలో విశిష్ట సేవలనందించే ప్రతిభావంతులకు ఈ అవార్డులను అందిస్తారు. ఈసారి రాజేశ్వర్‌రెడ్డికి జ్యోతిష్య రంగంలో అత్యున్నత సేవలందించినందుకు జాతీయ మహానంది అవార్డుతో పాటు సాహిత్య రంగంలో తెలుగు లెజెండరీ అవార్డును కూడా అందుకున్నారు. ఆదివారం వరంగల్ టీఎన్జీవో భవన్‌లో ఆయనకు అవార్డును అందజేశారు.

కొమురవెల్లి ఏఈవోగా శ్రీనివాస్‌కు డిప్యూటేషన్

- కొండగట్టుకు వైరాగ్యం అంజయ్య

చేర్యాల, ఫిబ్రవరి 4: కొమురవెల్లి మల్లన్న ఆలయానికి కొండగట్టు ఆలయ ఏఈవో బి. శ్రీనివాస్‌ను డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. మల్లన్న ఆలయం ఏఈవో వైరాగ్యం అంజయ్యను కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి బదిలీ చేస్తూ దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఆలయ పాలకమండలితో పాటు ఆలయవర్గాలతో నెలకొన్న విభేదాలు, ఫిర్యాదుల మేరకు అంజయ్యను ఇటీవల దేవాదాయశాఖ మెదక్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేయగా అతడు కోర్టును ఆశ్రయించడంతో డిప్యూటేషన్ ఆర్డర్‌ను సస్పెండ్ చేసింది. ఆ మరుసటిరోజే కోర్టు ఆర్డర్‌తో ఆలయానికి అంజయ్య వచ్చినా కమిషనర్ ఆదేశానుసారం చర్యలు తీసుకుంటానని ఈవో బాలాజీశర్మ నిరాకరించడంతో వెనుదిరిగిపోయిన సంగతి విదితమే. తిరిగి కొమురవెల్లిలోనే విధులు నిర్వర్తించేందుకు వైరాగ్యం అంజయ్య ముమ్మర ప్రయత్నాలు చేయడంతో ప్రస్తుత పునరుద్ధరణ కమిటీసభ్యులు, పలువురు స్థానిక కాంగ్రెస్‌నేతలు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, కమిషనర్‌ను కలిసి విధుల్లోకి చేర్చుకోకూడదని పట్టుబట్టారు. దీంతో నాటకీయ పరిణామాల మధ్య అంజయ్య తనను కొండగట్టుకు బదిలీ చేయాలని విన్నవించుకున్నారు.

చెరువులో దూకి వ్యక్తి బలవన్మరణం



మృతి చెందిన అందె ప్రభాకర్

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 4: మండలంలోని చిన్న ఆరేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం మత్తులో చెరువులో దూకి బలవన్మరణం చెందాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిన్న ఆరేపల్లి గ్రామానికి చెందిన అందె ప్రభాకర్(34), వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ అవసరాలకు చేసిన అప్పులతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 3న ఇంటి నుంచి ఉదయం వెళ్లి రాత్రి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా ఆదివారం గ్రామ సమీపంలో ఉన్న బెజుగామ గ్రామం రాగి చెరువులోని ఎక్స్‌కవేటర్ గుంతలో ప్రభాకర్ మృతదేహం కనిపించింది. పోలీసులు స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య సరిత, కూతురు ఉన్నారు. సుమారు రూ.4 లక్షల వరకు అప్పులు ఉన్నట్టు గ్రామస్థులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గజ్వేల్ ఏఎస్ఐ గోపాల్‌గౌడు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కుంటలో పడి వృద్ధుడి మృతి



గొల్ల దుబ్బయ్య (ఫైల్)

రాయపోల్, ఫిబ్రవరి 4: కుంటలో పడి ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన దౌల్తాబాద్‌లో చోటు చేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్ సాయిలు కథనం ప్రకారం... దౌల్తాబాద్‌కు చెందిన గొల్ల దుబ్బయ్య ఆదివారం గేదెకు నీళ్లు తాపేందుకు స్థానిక కొత్త కుంట వద్దకు తీసుకెళ్లాడు. నీళ్లు తాగిన అనంతరం గేదె కుంటలోకి వెళ్లింది. ఇది గమనించిన దుబ్బయ్య గేదెను బయటకు తీసుకురావడానికి కుంటలోకి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. మృతుడి కొడుకు యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్‌హెచ్‌వో సాయిలు వివరించారు.

నరసన్నపేట పంచాయతీ పాలకవర్గానికి సన్మానం



గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 4: గ్రామాల అభివృద్ధిలో గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల పాత్ర ఎంతో కీలకమైందని జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం పేర్కొన్నారు. ఆదివారం మర్కుక్ మండలంలోని నరసన్నపేట గ్రామంలో తాజా మాజీ సర్పంచ్, వార్డు సభ్యులకు జడ్పీటీసీ శాలువా కప్పి మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల పదవీకాలం ముగిసిన పాలకవర్గం గ్రామాభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేసిందని కొనియాడారు. అనంతరం సర్పంచ్ మాధవీరాజిరెడ్డితో పాటు వార్డు సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, ఎంపీటీసీ నరేందర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పని చేయాలి



హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

హుస్నాబాద్, ఫిబ్రవరి 4: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు కష్టపడి పని చేసి కరీంనగర్ ఎంపీగా బోయినపల్లి వినోద్ కుమార్ ను అత్యధిక భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ కోరారు. ఆదివారం హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను మళ్లీ జరగకుండా వచ్చే ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పని చేయాలని సూచించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వైఫల్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కాగా వరంగల్ లోకసభ బీఆర్ఎస్ అభ్యర్థిగా సుధీర్ కుమార్‌కు అవకాశం కల్పించాలని అధిష్టానానికి నియోజకవర్గ పార్టీ తరపున ఏకగ్రీవ తీర్మానం చేసి పంపిస్తున్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో హన్మకొండ జడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, రాష్ట్ర నాయకులు కర్ర శ్రీహరి, ఎంపీపీలు, జడ్పీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

నేటి నుంచి దుద్దెడ శంభుదేవుడి బ్రహ్మోత్సవాలు





ఆలయంలో కొలువైన శంబుదేవుడు, బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం

కొండపాక, ఫిబ్రవరి 4: మండలంలోని దుద్దెడ స్వయంభు శంభుదేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా ఈ ఉత్సవాలు పుష్య బహుళ దశమి నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. పందిళ్లు వేశారు. చివరిరోజు జరిగే శివపార్వతుల కల్యాణం అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం విఘ్నేశ్వర పూజతో బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని స్వయంభూ శంభు లింగేశ్వర సేవాసమితి ట్రస్ట్ సభ్యులు తెలిపారు. పుణ్యాహవాచనం, అంకురార్పణ, మూలవిరాట్ అభిషేకం, అమ్మవారికి అభిషేకం, సాయంత్రం శకటోత్సవం ఆలయం చుట్టూ వాహనాలు, బండ్లు తిరుగుతాయన్నారు. మంగళవారం స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రభిషేకం, శంభుదేవునికి అన్నాభిషేకం, లక్ష్మీగణపతి హోమం, సుదర్శన హోమం, చండీ హోమం జరుగుతాయన్నారు. రాత్రి దిష్టి కుంభాల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

చివరి రోజైన బుధవారం ఉదయం స్వామివారికి ఎదుర్కోళ్లు, అనంతరం శివ పార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుందని వివరించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ, రాత్రి స్వామివారి రథోత్సవం, ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు.

హల్దీవాగులో మునిగి యువకుడి మృతి

మాసాయిపేట, ఫిబ్రవరి 4: చేపల వేటకు వెళ్లిన యువకుడు హల్దీవాగులో మునిగి మృతి చెందాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన నంద(22) మాసాయిపేటలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం సమీపంలోని హల్దీవాగులో చేపల వేటకు వెళ్లగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ నవతాగౌడ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

రక్త స్రావమై బాలింత మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనంటూ కుటుంబీకుల ఆరోపణ

చేగుంట, ఫిబ్రవరి 4: మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కావేటి లత(25) ప్రసవం కోసం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి శనివారం వెళ్లగా, ఆదివారం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో లతకు అధిక రక్త స్రావం అవుతుండడంతో మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులకు అక్కడి వైద్యులు తెలిపారు. హుటాహుటిన కొంపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే లత మృతి చెందింది. ప్రభుత్వ వైద్యులు ముందుగా సమాచారమివ్వకపోవడం వల్లే బాలింత మృతి చెందిందని కుటుంబ సభ్యులు, గొల్లపల్లి తాజా మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి ఎల్లారెడ్డి ఆరోపించారు. వైద్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆస్పత్రిలో మహిళ మృతి.. కేసు నమోదు

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 4: సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ మృతి చెందినట్లు పట్టణ సీఐ శ్రీధర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మునిపల్లి మండలం బుదేరాకు చెందిన సాయమ్మ(40) గాయాలతో జనవరి 20న సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చింది. చికిత్స పొందుతున్న ఆమె జనవరి 27న మృతి చెందింది. ఆమె వద్ద ఉన్న ఫోన్ నంబర్లకు కాల్ చేసినా సంబంధీకులెవరూ అందుబాటులోని రాకపోవడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ తెలిపారు. ఇంతవరకు ఎవరూ రాకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని సీఐ తెలిపారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన కేసీఆర్

నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 4: పదేళ్ల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఆరోపించారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న సిద్దిపేటలో టీపీసీసీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, పలువురు మంత్రులు, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు పర్యటన ఉన్నందున కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. ఈ నెల 6న మధ్యాహ్నం పాత బస్టాండ్ వద్ద అంబేడ్కర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తారని, అనంతరం ముసాబాద్ చౌరస్తా, 9వ వార్డులో పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయనున్నట్టు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల ముందున్న కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం భూమి పూజ కార్యక్రమం, సమావేశం ఉంటుందని వివరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారన్నారు. కార్యక్రమంలో మార్క సతీష్‌గౌడ్, ఖలీముద్దీన్, తిరుపతి, రాజనరేందర్, షాబుద్దీన్, హర్షద్, మున్నా, వాహబ్, మెరుగు రాజు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తే ఊరుకోం



సంక్షేమ వసతి గృహాలను సందర్శించి సమస్యలను తెలుసుకుంటున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 4: ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థుల పట్ల అధికారులు వార్డెన్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ కాసోజు నాగజ్యోతి పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేటలోని సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులను కలిసి పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డెన్లు స్థానికంగా లేకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల పట్ల వార్డెన్లు బాధ్యతాయుతంగా ఉండాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. సంక్షేమ హాస్టళ్లపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉండాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఆమె వెంట ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా గర్ల్స్ నాయకులు తోళ్ల శ్రీజ, ఉడుగుల సుకన్య, అరుణ, రీతూ, నవ్య తదితరులు పాల్గొన్నారు.

పాండురంగాశ్రమంలో అఖండ రామ నామ సప్తాహం



రామ నామ భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 4: మర్కుక్ మండలంలోని భవనందాపూర్ గ్రామ సమీపంలో గల పాండురంగ ఆశ్రమంలో అఖండ హరే రామ నామ సప్తాహం ఆదివారం ఉదయం ప్రారంభమైంది. శతకోటి హరే రామ నామ జప యజ్ఞంలో భాగంగా వారం రోజుల పాటు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం శ్రీ అవధూతేంద్ర సరస్వతి స్వామి శిష్య బృందం దీనిని ప్రారంభించగా, ఉదయం నుంచి హరే రామ నామ జపం కొనసాగింది. జగదేవ్‌పూర్, వాసాలమర్రి, దౌలాపూర్, ప్రజ్ఞాపూర్, దిల్ షూక్‌నగర్, సిద్దిపేట, ఘట్‌కేసర్ ప్రాంతాలకు చెందిన భక్త బృందం సభ్యులు పాల్గొని రామనామ జపం చేశారు. ఈ కార్యక్రమంలో పాండురంగ ఆశ్రమ నిర్వాహకులు అప్పల రసరాజుశర్మ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జనసమితిలో పలువురి చేరిక



టీజేఎస్‌లో చేరినవారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న కోదండరాం

గజ్వేల్, ఫిబ్రవరి 4: సిద్దిపేట జిల్లాకు చెందిన పలు పార్టీల నాయకులు ఆదివారం తెలంగాణ జనసమితిలో చేరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జనసమితి పార్టీ కార్యాలయంలో టీజేఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నిరుడి స్వామి ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం సమక్షంలో టీజేఎస్‌లో చేరారు. కోదండరాం వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ అందరూ సమన్వయంతో పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా పర్యటించి మండల కమిటీలు, గ్రామ కమిటీలు, జిల్లా కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. వారివెంట టీజేఎస్ యువజన విభాగం అధ్యక్షుడు కేసరి స్వామి, నాయకులు శ్రీనివాస్, యాదగిరి, శ్రీనివాస్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌పార్టీ కొండాపూర్ గ్రామకమిటీ ఎన్నిక



ఎన్నికైన సభ్యులను అభినందిస్తున్న జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి

మద్దూరు, ఫిబ్రవరి 4: ధూళిమిట్ట మండలం కొండాపూర్ గ్రామంలో ఆదివారం జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బండి శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు కమలాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ గ్రామకమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడుగా తొర్రి మల్లేశ్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా ధరావత్ రాజు, పేరబోయిన రాజు, ప్రధాన కార్యదర్శిగా మంద పవన్, భీమగోని రాకేశ్, గుగులోతు శ్రీనివాస్, సభ్యులుగా స్వరూప, గట్టయ్య, యాదయ్య, కనకయ్య, శ్రవణ్, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడుగా గుగులోతు సంతోశ్, ఉపాధ్యక్షులుగా బోల్లబోయిన మహేశ్, కార్యదర్శిగా కొయ్యడ మధు ఎన్నికయ్యారు. కార్యక్రమం లో ఎంపీటీసీ ఇస్లావత్ నముకు, బెక్కల్ సర్పంచు బాలరాజు యాదవ్, లింగాపూర్ ఉపసర్పంచు జెల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో రక్తదాన శిబిరం



హుస్నాబాద్‌లో రక్త దానం చేస్తున్న యువకులు

హుస్నాబాద్, ఫిబ్రవరి 4: పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో ఆదివారం 24/7 రక్త దాతల అర్గనైజేషన్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కరీంనగర్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 67మంది పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ తోట మహేష్, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, పీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి, చిత్తారి రవీందర్, కర్ణకంటి మంజులారెడ్డి, ఆర్గనైజేషన్ సభ్యులు ఇల్లందుల అజయ్, గట్టు సాయికృష్ణ, పిన్న రమేష్, సామల హరిప్రసాద్, గుగులోత్ రఘుపతి, ఎనగందుల కమలహసన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సీటు కోసమే సీఎంపై విమర్శలు



గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న సర్దార్‌ఖాన్

గజ్వేల్, ఫిబ్రవరి 4: ఎంపీ సీటు కోసమే బీఆర్ఎస్ నాయకుడు ప్రతాప్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని హరితా రెస్టారెంట్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తే చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు ఆటోడ్రైవర్లను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ఇదే పద్ధతిని కొనసాగిస్తే రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ నాయకులను గ్రామాల్లోని మహిళలు తరిమికొడతారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలైనా గడవకముందే చౌకబారు విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొడకండ్ల బాలు, అహ్మదీపూర్ బాలాగౌడ్, దప్పు గణేశ్, సమీర్, అజీమ్ తదితరులున్నారు.

మృతుడి కుటుంబానికి ఆపన్నహస్తం

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 4: మండలంలోని రిమ్మనగూడ గ్రామంలో ఇటీవల సిద్దాల శివకుమార్ అనారోగ్యంతో మరణించగా, అతడికి భార్య, 10 సంవత్సరాలలోపు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో ఆ కుటుంబానికి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ సమాచారాన్ని గజ్వేల్‌కు చెందిన ఆపన్నహస్త మిత్ర బృందం సభ్యులు తెలుసుకుని ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మిత్ర బృందం సభ్యులంతా కలసి మృతుడి కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆపన్నహస్త మిత్రబృందం అధ్యక్షుడు బాలచంద్రం, సభ్యులు కటుకం శ్రీనివాస్, శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిప్పంటుకుని మహిళకు తీవ్ర గాయాలు

నిజాంపేట, ఫిబ్రవరి 4: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. బాధిత మహిళ కుమారుడు ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కల్వకుంట్ల గ్రామానికి చెందిన కోమండ్ల సువర్ణ(53) కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నది. ఆదివారం ఇంటి పూజగదిలో ఉన్న దీపానికి ప్రమాదవశాత్తు ఆమె చీర తగలడంతో నిప్పంటుకొని తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్సు వాహనంలో ఆమెను సిద్దిపేట ఆస్పత్రికి తీసుకెళ్లి, మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్టు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 4: గత నెల 22న మెదక్ పట్టణంలో జరిగిన హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ దిలీప్‌కుమార్ ఆదివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక నవాబుపేటకు చెందిన పోతరాజ్ నగేష్(25) తమ్ముడు ఉదయ్‌పాల్ అదే వీధికి చెందిన భవానిని ప్రేమించాడు. ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారైనా నగేష్ కుటుంబీకులు పెళ్లికి అంగీకరించలేదు. ఆగ్రహించిన భవాని సోదరుడు బొందుగుల రంజిత్‌కుమార్ నగేష్‌పై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. పరారీలో ఉన్న నిందితులైన రంజిత్‌కుమార్, తల్లి కవిత, అత్త లక్ష్మిలను ఆదివారం అరెస్టు చేశారు.